## క్లుప్తంగా

### గెస్ట్ లెక్చరర్లకు ఆహ్వానం

**వరంగల్ :** దేశాయిపేటలోని చందా కాంతయ్య మెమోరియల్ (సీకేఎం) ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి విద్యాశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకానమిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, తెలుగు, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, బాటనీ విభాగాల్లో ఒక్కో పోస్టు, కామర్స్‌లో రెండు పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ 50శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెల్ట్, సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై 1వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలు 2వ తేదీ ఉదయం 10గంటలకు సీకేఎంలో జరుగుతాయని తెలిపారు.

### రేపు అప్రెంటిస్ మేళా

**వరంగల్ :** ఈనెల 29వ తేదీన ములుగురోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అప్రెంటిస్‌లో గజ్వేల్‌కు చెందిన రానే బ్రాక్ లైనింగ్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన వరుణ్ మోటార్స్ కంపెనీలు పాల్గొంటున్నాయని, శిక్షణ కాలంలో ఎంపికైన అభ్యర్థులకు స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు.

### సరళారూన్సీరాణికి డాక్టరేట్



**విద్యారణ్యపురి :** హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సరళారూన్సీరాణికి గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డాక్టరేట్ పొందిన సరళారూన్సీరాణిని గురువారం కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు విభాగం అధిపతి డాక్టర్ ఎస్.వినోద్‌రావు, ఇతర అసిస్టెంట్ ప్రొఫెసర్లు సన్మానించి, అభినందించారు.

### కుట్టుమిషన్ల పంపిణీ




**కాజీపేట :** కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలోని అల్ఫా ఓమేగా హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లతో పాటు మిషన్లను అందించి అభినందించారు. జాన్ మార్కండేయ, కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, కాంగ్రెస్ నాయకులు గుంటి కుమార స్వామి, పి.ఆంజనేయులు, సమత, ట్రస్ట్ సభ్యులు నిఖిల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

### 'రుణమాఫీ అభినందనీయం'

**హన్మకొండ అర్బన్ /హసన్‌పర్తి :** రైతులకు రూ.2లక్షల రుణమాఫీ నిర్ణయం సాహసోపేతమని తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రుణమాఫీ అమలు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, అభినందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం చారిత్రాత్మకమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి అన్నారు.

### చెత్త తొలగింపు



**ఖిలా వరంగల్ :** వరంగల్ 43వ డివిజన్ నాయుడు పెట్రోల్ పంపు సమీపంలోని శ్రీవెంకటేశ్వర కాలనీలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని కాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్, శ్రీనివాస్ గుప్తా నేతృత్వంలో గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేయగా, బల్దియా అధికారులు వెంటనే స్పందించారు. గురువారం పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీల్లో పేరుకపోయిన చెత్తా చెదారం తొలగించి రహదారులను శుభ్రం చేశారు. సుభాష్‌రావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీపీని కలిసిన సెంట్రల్ జోన్ డీసీపీ



**వరంగల్ క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన షేక్ సలీమా గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# కుంటను తలపిస్తున్న సర్కారు బడి

**హన్మకొండ చౌరస్తా :** హనుమకొండలోని పెద్దమ్మ గడ్డ పాలెం ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణలో నీరు నిలిచి కుంటలా మారింది. ప్రాంగణంలో వర్షపు నీరు నిలవడంతో బురదమయంగా మారింది. విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రతిజ్ఞ చేయడానికి వీలుకాక పోవడంతో నేరుగా తరగతిలోకి వెళ్లారు. ఇక భవనం పైకప్పు పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయం భయంగా పాఠాలు వింటున్నారు. ఈ పాఠశాలలో ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు కొనసాగుతుండగా, మొత్తం 200ల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

# 'వీసీని వెంటనే బర్తరఫ్ చేయాలి'

**కేయూ క్యాంపస్ :** హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్‌వద్ద వీసీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడారు. అప్రజాస్వామిక పాలనకు పాల్పడిన సెంట్రల్ యూనివర్సిటీ వీసీని వెంటనే బర్తరఫ్ చేయాలని, యూనివర్సిటీలో సుకున్ ఫెస్టివల్ నిర్వహించాలని విద్యార్థి సంఘం నాయకులు, అధికారులను అడిగినప్పటికీ అనుమతి ఇవ్వలేదన్నారు. దీంతో విద్యార్థులతో కలిసి వీసీ లాడ్జ్ ఎదుట నిరసన తెలపగా, పోలీసులను పిలిపించి వారిపై కేసు నమోదు చేయించారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ కమిటీ సెక్రటరీతో పాటు నలుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారని, అలాగే మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేల ఫైన్ విధించారన్నారు. విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తివేసి, కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రటరీ జస్వంత్, బాధ్యులు సందీప్, రాజ్‌కుమార్, సుమన్, కుమార్, ప్రవళిక, అనూష, శిరీష, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



వీసీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

### ప్రమాదకరంగా ఇనుప చువ్వలు

**కాజీపేట అర్బన్ :** కడిపికొండ ఆర్వోబీపై ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే వాహనాల టైర్ పంక్చర్ తప్పదు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కడిపికొండ ఆర్వోబీపై ఏర్పడిన గుంతలు, అందులో నుంచి బయటకు వచ్చిన ఇనుప చువ్వలతో కడిపికొండ బ్రిడ్జిపై నుంచి ప్రయాణం అంటేనే వాహనదారులు జంకుతున్నారు. కాజీపేట నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ బ్రిడ్జిపై నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. కాస్త ఏమరుపాటుగా ఉన్న వాహనాల టైర్లకు ఇనుప చువ్వలు గుచ్చుకుని టైర్ పంక్చర్ అయ్యే ప్రమాదం ఉంది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకుని కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



కడిపికొండ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఇనుప చువ్వ

# బాధ్యులను కఠినంగా శిక్షించాలి

**హన్మకొండ :** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ప్రాంతంలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన అమానవీయ అత్యాచారాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ ఈశ్వరమ్మకు బీసీలు అండగా నిలుస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చుంచు రాజేందర్, క్రాంతికుమార్, సోమ రామమూర్తి, చిల్లా రాజేంద్ర ప్రసాద్, కన్నం సునీల్, సోమిడి శ్రీనివాస్, కేడల ప్రసాద్, కూనూరు రంజిత్ గౌడ్, రాచకొండ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

**హన్మకొండ అర్బన్ :** పీఆర్సీలో మున్సిపల్ కార్మికుల వేతనాలు రూ.26వేలుగా పెంచాలని డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అందరికంటే ఎక్కువ పనిచేస్తూ తక్కువ వేతనం తీసుకుంటున్నారని అన్నారు. వేతనాలు పెంచుతామని, కాంట్రాక్ట్ వారిని పర్మనెంట్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఇప్పుడు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మికులకు యూనిఫాం, గ్లౌజ్‌లు, ఇతర సామగ్రి మూడేళ్లుగా ఇవ్వలేదని వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు. బొట్ల భిక్షపతి, ధర్మరాజు, మహేష్, రఘు, బాబు ఉన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నేతలు

# సుశీలమ్మ సేవలు ఆదర్శనీయం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రన్న

**ఖిలా వరంగల్ :** ఆరెల్లి సుశీలమ్మ ఇంటిపై పోలీసులు దాడి చేసిన ధైర్యంగా ఎదుర్కొని నిలబడేదని, సమాజానికి ఆమె చేసిన సేవలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు బండి కోటేశ్వరరావు, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు చంద్రన్న, సారంపెల్లి వాసుదేవరెడ్డి, హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, మండల వెంకన్న సూచించారు. ఈ మేరకు గురువారం ఖిలా వరంగల్ మధ్యకోటలో ఆరెల్లి సుశీలమ్మ సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ ఎంఎల్ నేత బైరబోయిన ఐలయ్య, హైదరాబాద్ నగర కార్యదర్శి విజయ్‌తో కలిసి వారు సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుశీలమ్మ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. రాచర్ల బాలరాజు, మైదం పాణి, కృష్ణ, హరిబాబు, చిర్ర సూరి, గడ్డం సదానందం, నున్న అప్పారావు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ సమస్య పరిష్కరించాలి

- టీజీమెపా రాష్ట్ర అధ్యక్షుడు పి.దేవేందర్

**హన్మకొండ :** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు, మేనిఫెస్టోలో పేర్కొన్న ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో మెపా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవేందర్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల చిరకాల వాంఛ అయిన బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మారుస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. లేని ఎడల త్వరలోనే పోరాటానికి భవిష్యత్ కార్యాచరణను తీసుకుంటామన్నారు. అదే విధంగా మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, దండు చిరంజీవి, అచ్చునూరి కిషన్, చెన్నబోయిన సాయిశివ, రావుల రాణాప్రతాప్, సింగారపు రామకృష్ణ, పులి రాజేష్, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

## పెద్ద చెరువు తూముకు మరమ్మతు చేయండి

**హసన్‌పర్తి :** స్థానిక పెద్ద చెరువు తూము ధ్వంసమైంది.. గేర్ బాక్స్ దెబ్బతిని..షట్టర్ మాయమైనట్లు రైతులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి తూముకు మరమ్మతు చేయించాలని విజ్ఞప్తి చేశారు. హసన్‌పర్తి పెద్ద చెరువుకు మూడు తూములు ఉండగా, ఇటీవల రెండో తూము దెబ్బతినడంతో రైతుల సహకారంతో బాగుచేయించారు. మూడో తూము కూడా రిపేర్‌కు రావడంతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపించారు. అయితే గేర్ బాక్స్ దెబ్బతినగా, షట్టర్ లేకపోవడం వల్ల వరద నీరు చేరినప్పుడు చెరువులో నీరు నిల్వ ఉండదని రైతులు పేర్కొన్నారు. ఈ తూము కింద 120 ఎకరాల ఆయకట్టు సాగు చేస్తున్నామని రైతులు చెప్పారు. తూము మరమ్మతు చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరారు. మరమ్మతు చేయకుంటే ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.



దెబ్బతిన్న గేర్ బాక్స్

**క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్**

**రామన్నపేట :** విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ అందుకుంటారని ప్రధానోపాధ్యాయురాలు అరుణ సూచించారు. ఈమేరకు గురువారం వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అరుణ అధ్యక్షతన విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించగా ఆమె మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విశేషమైన కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**చర్య తీసుకోవాలి**

**ఎంజీఎం :** కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎంలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులు ప్రజలకు చికిత్స చేయకుండా ప్రైవేట్ వైద్యం నిర్వహిస్తున్నారు. అలాంటి వారిపై అనేక సార్లు ప్రభుత్వానికి, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ లేఖ విడుదల చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటించనున్న సందర్భంగా విషయంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, కమిటీ సభ్యులు సముద్రాల అనిల్ విజ్ఞప్తి చేశారు. రోగులు వైద్యం కోసం కేఎంసీ, ఎంజీఎంకు వస్తుంటే విధుల్లో ఉండాల్సిన డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల నిరాశ చెందుతున్నారని అన్నారు.

**జనావాసాల్లోకి కొండచిలువ**

**కాజీపేట :** కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలోని జనావాసాల్లోకి గురువారం కొండచిలువ రావడంతో కొద్దిసేపు జనాలు భయాభ్రాంతులకు గురయ్యారు. కాలనీలోని ఆర్పీఎఫ్ రిటైర్డ్ ఎస్సై బర్ల వెంకటేశ్వర్లు ఇంటి పరిసరాల్లో కొండచిలువ కనిపించింది. దీంతో బాటసారులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వగా కొండచిలువను పట్టుకున్నారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గుట్టలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

**టెండర్ల ఖరారు**

**వరంగల్ :** ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని యార్డు (పసుపు, పల్లికాయ, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డు), లక్ష్మీపురంలోని పాత, నూతన మోడల్ కూరగాయల మార్కెట్‌లలో 11నెలల పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టిందుకు నిర్వహించిన టెండర్లను ఖరారు చేసినట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి తెలిపారు. యార్డుల క్లీనింగ్‌తో పాటు షాప్ షాపు, క్యాంటీన్, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించిన టెండర్లను పిలవగా మొత్తం 15మంది దరఖాస్తులు చేసినట్లు తెలిపారు.

# రెగ్యులరైజ్ చేయాలని వినతి

**కేయూ క్యాంపస్ :** కేయూలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తక్షణమే స్కేల్‌ను అమలుచేస్తూ, రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ( కుక్టా జాక్) బాధ్యులు గురువారం హనుమకొండలో అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. నేడు వరంగల్‌కు రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. నాయకులు డాక్టర్ కరుణాకర్‌రావు, ప్రవీణ్, సాధు రాజేష్, చిర్ర రాజు, ఫిరోజ్ పాషా, రవీందర్, గజ్జల మల్లేష్, ఆరూరి సూర్యం, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు సన్మానం**

యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ బాధ్యులు గురువారం హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజును శాలువాతో సన్మానించారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జాక్ బాధ్యులు

## సర్వీస్ రోడ్డు నిర్మించాలి

**హసన్‌పర్తి :** జగిత్యాల నుంచి దండపల్లి మీదుగా హనుమకొండ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 563 డిజైన్‌ను మార్చారని రైతులు ఆరోపించారు. మండలంలోని అన్నాసాగరంలో డిజైన్‌లో సూచించిన సర్వీస్ రోడ్డును తొలగించారని పేర్కొన్నారు. ఈమేరకు గ్రామశివారు ఎస్సారెస్పీ కాల్వ వెంట జరుగుతున్న జాతీయ రహదారి పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. డిజైన్‌లో సూచించిన మేరకు సర్వీస్ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోతే రైతులు ఇబ్బందులకు గురవుతారని మాజీ సర్పంచ్ బండా అమితారెడ్డి తెలిపారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రోడ్డు డిజైన్‌ను మార్చారని గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యేలు వెంటనే జాతీయ రహదారి అధికారులతో మాట్లాడారు.



శ్రీహరికి వినతిపత్రం ఇస్తున్న రైతులు, గ్రామస్తులు

# యూనియన్ పటిష్టతకు కృషి చేయాలి

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులకు సన్మానం

**నయీంనగర్ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నూతన కార్యవర్గ ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, కార్యవర్గ సభ్యులుగా కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గురువారం ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ, వరంగల్ జిల్లా, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం దక్కడం హర్షనీయమన్నారు. యూనియన్ పటిష్టతకు కృషి చేయాలని, జర్నలిస్టుల సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పీవీ మదన్‌మోహన్ రావు, గడ్డం కేశవమూర్తి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ నాయకులు శ్రీరామ్ చందర్, మట్ట దుర్గాప్రసాద్, సంగోజు రవి, కె.రవీందర్‌రెడ్డి, ఎస్.యాదగిరి, సాయిరాం, కె.దుర్గాప్రసాద్, అల్లం రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నాయకులను సన్మానిస్తున్న బాధ్యులు

## సంక్షిప్త సమాచారం

**మౌలిక వసతులు కల్పించాలి**



**విద్యారణ్యపురి :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రాచకొండ రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యావ్యవస్థపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే విద్యాశాఖమంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు ముషారఫ్, అనిష్, రితిక్ తదితరులు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలను నిర్మూలించాలి**



**ఖిలావరంగల్ :** బాల్య వివాహాలను నిర్మూలించాలని, బాలికపై జరుగుతున్న లైంగిక దాడులను నిరోధించాలని సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ సూచించారు. ఈమేరకు గురువారం మధ్యకోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, సురేష్ కుమార్, సుదర్శన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బహుజన వాది బొజ్జ తారకం**



**హన్మకొండ :** ప్రజల పక్షాన పోరాడిన గొప్ప బహుజనవాది బొజ్జ తారకం అని బహుజన ఉద్యమ నాయకుడు బండి మొగిళి అన్నారు. గురువారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(బొజ్జ తారకం) ఆధ్వర్యంలో బొజ్జ తారకం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జ తారకం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొజ్జతారకం ఆశయాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

**రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?**

**హన్మకొండ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం బీఆర్ఎస్‌వి కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ విమర్శించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్‌వీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. వెంటనే జాబ్ క్యాలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, నాయకులు లంక రాజగోపాల్, కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, హర్ష మధు, పసునూరి టోనీ, పస్తం అనిల్, రత్నం అశోక్ పాల్గొన్నారు.

**గుట్కా ప్యాకెట్లు స్వాధీనం**

**రామన్నపేట :** వరంగల్ గణేష్‌నగర్‌లో వంగరి అరుణ్ పాన్‌షాపులో నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి రూ.6,950 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రవికుమార్, శరత్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు

**దాడి చేసిన వ్యక్తిపై కేసు**

**కాజీపేట :** ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేయడంతో పాటు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న వరంగల్-1 డిపోకు చెందిన బస్సును డీజిల్ కాలనీ వద్ద రాకేష్ భిక్షపతి కారుతో అడ్డుకున్నాడు. అనంతరం బస్సు డ్రైవర్ కొలిపాక రవిని దుర్భాషలాడుతూ, దాడి చేయడంతో గాయపడ్డాడు. అడ్డుకున్న ప్రయాణికులపై రాకేష్ దాడికి యత్నించినట్లు ఆర్టీసీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

# విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**మడికొండ :** మడికొండలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బోయినపల్లి రాధాకృపాకర్‌రావు దంపతులు నోట్‌బుక్స్, పలకలు అందజేశారు. సామాజిక వేత్త లెక్చరర్ ఎస్.రాధాకృష్ణ, హెచ్.ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు రాజేశ్వరీ, రమేష్, అరుణ, మన్నె చంద్రయ్య, హైమవతి, కమల, సరిత, సిబ్బంది చందు, భాగ్యమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పలకలు అందజేస్తున్న బాధ్యులు